క్లుప్తంగా

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి



మాచర్ల: పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా ఎక్కడబడితే అక్కడ ఆటోలు నిలిపితే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ ఎస్‌ఐ వెంకటరమణ హెచ్చరించారు. మంగళవారం అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఆటో డ్రైవర్లు, యజమానులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. పలు అంశాల పై అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ రోడ్డు మీద ఎక్కడబడితే అక్కడ ఆటోలు ఆపవద్దని కోరారు. డ్రెస్ కోడ్ తప్పని సరిగా పాటించాలని చెప్పారు. మైనర్లు, లైసెన్స్ లేని వారు ఆటోలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు



మాచర్ల: పట్టణంలో పారిశుద్ధ్య పనులు మెరుగునకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు తెలిపారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో మంగళవారం పర్యటించారు. ఆయన మాట్లాడుతూ వార్డులలో సమస్యలుంటే కౌన్సిలర్లు, వారు సచివాలయ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రతి వార్డు అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

క్రీస్తుని ఆరాధించాలి



దాచేపల్లి: ప్రతి ఒక్కరూ ప్రభువైన ఏసుక్రీస్తుని ఆరాధించాలని పాస్టర్ జయపాల్ అన్నారు. దాచేపల్లి నగర పంచాయతీలోని దక్షిణగడ్డ క్రీస్తు లూథరన్ దేవాలయం వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాస్టర్ జయపాల్ మాట్లాడుతూ క్రీస్తు బోధనలు అనుసరణీయమని చెప్పారు. వార్షికోత్సవ సందర్భంగా ప్రత్యేక గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో పాస్టర్లు మోషే, మరియదాసు, డెలిగేట్ గోసు జాన్ పిటర్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి



దుర్గి: రైతులకు కంది విత్తనాలు ఎంపీపీ శంకర్ పంపిణీ చేశారు. రైతు సేవా కేంద్రంలో పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని రైతులందరికీ మేలు జరిగేలా కృషి చేయాలని ఎంఏఓ, వీఏఏ, వీహెచ్ఏలు ఎంపీపీని కోరారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నతాధికారులకు తెలిపి రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు.

బస్ షెల్టర్ వద్ద వ్యక్తి మృతి

క్రోసూరు: క్రోసూరు బస్ షెల్టర్ వద్ద యాచకుడు మృతి చెంది ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్‌ఐ పి.రవిబాబు యాచకుడి బంధువులను పిలిపించి విచారించగా మృతుడు పెదకూరపాడు మండలం 75 త్యాళ్లూరుకు చెందిన కె.శ్రీను(40)గా గుర్తించారు. గత కొంత కాలంగా క్రోసూరులోనే యాచకుడిగా జీవిస్తున్నట్లు తెలిపారు. బంధువుల కోరిక మేరకు మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి

డీఈవో చంద్రకళ

అమరావతి: విద్యార్థులందరూ ప్రతిరోజు పాఠశాలకు యూనిఫాంలో హాజరు కావాలని ఏ రోజు పాఠాలు ఆ రోజే పూర్తి చేసి క్రమశిక్షణ అలవర్చుకోవాలని పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని లింగాపురం మోడల్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పాఠశాలలోని రైజింగ్ స్టార్స్ పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరిచి, విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించి అందుకు అనుగుణంగా విద్యా ప్రమాణాల పెంపుకు కృషి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి శివబాబు పాల్గొన్నారు.

దేవాలయాలలో అమ్మవారికి పూజలు



శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి దేవాలయంలో అమ్మవారికి పూజలు చేస్తున్న దృశ్యం



అన్నపూర్ణేశ్వరి అమ్మవారిని అలంకరించిన దృశ్యం

మాచర్ల: పట్టణంలోని పత్తి ఫ్యాక్టరీ ప్రాంతంలో, సాయిబాబా దేవాలయంలోని లలిత అమ్మవారికి మంగళవారం శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని వందలాది మంది మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కుంకుమార్చన చేసి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అమ్మవారిని మంగళగౌరీగా అలంకరించారు. పాత మాచర్లలోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, కమిటీ అధ్యక్షులు భవనాశి వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రెటరీ తిరివీధి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. పట్టణంలోని సొసైటీ కాలనీలోని అన్నపూర్ణ, గాయత్రీదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. మహిళా భక్తులు కుంకుమ పూజలు చేశారు. పట్టణంలోని నగరేశ్వర స్వామి దేవాలయంలో అమ్మవారికి శ్రావణమాసం సందర్భంగా అర్చకులు వంశీ ఆధ్వర్యంలో పూజలు చేశారు. పట్టణంలోని చంద్రవంక బ్రిడ్జి ప్రాంతంలో ఆదిలక్ష్మి అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు, ధర్మకర్త ఆధ్వర్యంలో కుంకుమ పూజలు చేశారు. పాతవూరులోని యాదవ బజారులో చౌడమ్మ దేవాలయంలో ప్రత్యేకంగా అమ్మవారిని అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో మంగళగౌరీ పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

ఘనంగా నాగ పంచమి పూజలు

మాచర్ల: పట్టణంలోని శ్రీశైలం రోడ్డులోని రామాంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం మంగళగౌరీ వ్రతంతో పాటు నాగ పంచమి పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే నాగేంద్రుని పూజించేందుకు మహిళలు బారులు తీరారు. పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం వరకు అర్చకుల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

స్మార్ట్ మీటర్‌లను అడ్డుకోండి

సీపీఎం మండల కార్యదర్శి సూరిబాబు



ఇంటింటా ప్రచారంలో సీపీఎం సభ్యులు

అమరావతి: మీ ఇంటికి స్మార్ట్ మీటర్ బిగించడానికి వస్తే అడ్డుకోండంటూ సీపీఎం ఆధ్వర్యంలో మండల కేంద్రమైన అమరావతిలో మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు నేతృత్వంలో నిర్వహించిన ఈ ప్రచారంలో రాష్ట్ర ప్రభుత్వం అదానీ కంపెనీతో ఒప్పందం చేసుకుని ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపుతుందని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ ప్రతి ఇంటికి మీటర్‌కు అయ్యే ఖర్చును రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు 93 నెలలపాటు అద్దె పేరుతో మన వద్దే వసూలు చేస్తారన్నారు. రాష్ట్రంలో రెండు కోట్ల మీటర్లు అదానీ కంపెనీకి కాంట్రాక్ట్ ఇచ్చారని సుమారు రూ.25 వేల కోట్ల భారం రాష్ట్ర ప్రజలపై పడుతుందన్నారు. అదానీ కంపెనీని బాగుచేయడానికే స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని, ఇంటి యజమాని ఇష్టం లేకుండా స్మార్ట్‌మీటర్లు బిగించే అవకాశం లేదని, స్మార్ట్ మీటర్లను ప్రజలంతా తీవ్రంగా వ్యతిరేకించాలన్నారు. ఇప్పటికే స్మార్ట్ మీటర్లు బిగించడం వలన విద్యుత్ బిల్లులు విపరీతంగా వస్తున్నాయని దుకాణ యజమానులు ఆందోళన చెందుతున్నారన్నారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ఆగస్టు 5న విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించే నిరసన ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతిలేని లే అవుట్లను క్రమబద్ధీకరించుకోవాలి

మున్సిపల్ కమిషనర్ ఎన్.ఆనంద్‌కుమార్

సత్తెనపల్లి: మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ జారీ చేసిన జీవో ఎంఎస్ 134 ప్రకారం ఆంధ్రప్రదేశ్ లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం 2020కు పలు సవరణలు చేస్తూ 2025 జూన్ 30కు ముందు ప్లాటుగా రిజిస్టర్ కాబడిన అన్ని లే అవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ ఎన్.ఆనంద్‌కుమార్ మంగళవారం తెలిపారు. కావున సత్తెనపల్లి పురపాలక సంఘం పరిధిలోని అనుమతిలేని(అనాథరైజ్డ్) లే అవుట్ల యజమానులు, డెవలపర్లు, ప్లాట్ల అమ్మకం, కొనుగోలుదారులు ప్రభుత్వం నిబంధనల మేరకు 10 శాతం ఓపెన్ స్పేస్ లేదా 14 శాతం ఓపెన్ స్పేస్ చార్జీలను పీనలైజేషన్ చార్జీలతో సహా చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలని అన్నారు. ఈ జీవో జారీ చేసిన ఈ నెల 26 నుంచి 90 రోజుల్లోపు క్రమబద్ధీకరించుకొనుటకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు పురపాలక సంఘ కార్యాలయంలోని హెల్ప్‌డెస్క్‌లో గానీ, వార్డు సచివాలయాల్లో గానీ సంప్రదించాలని తెలిపారు.

సినారే సాహిత్యం సుస్థిరం



సినారే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

చిలకలూరిపేటటౌన్: పట్టణంలోని ఆర్‌వీఎస్ఎస్‌సీవీఎస్ హైస్కూల్‌లో జన విజ్ఞానవేదిక, లాలూ దాదా సాహెబ్ సేవాసమితి ఆధ్వర్యంలో జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి జయంతి కార్యక్రమం జరిగింది. పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు తంగెళ్ళ సుధాకర హరిప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీ విమర్శకులు డాక్టర్ పీవీ సుబ్బారావు పాల్గొని మాట్లాడారు. నారాయణరెడ్డి రాసిన కావ్యాల గురించి ఆయన వివరించారు. సినారే రాసిన గజళ్ళు, ప్రపంచ పదులు పాడి వినిపించారు. బాల సాహితీవేత్త జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ దార్ల బుజ్జిబాబు మాట్లాడుతూ సి.నారాయణరెడ్డి 3 వేలకు పైగా సినిమా పాటలు రాశారన్నారు. బాలగేయాలు కూడా అనేకం రాశారన్నారు. ముందుగా అతిథులు సినారే చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఇందులో భాగంగా పాఠశాల గ్రంథాలయానికి రూ.3 వేల విలువైన బాలసాహిత్య గ్రంథాలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో లాలూ దాదా సాహెబ్ సేవాసమితి అధ్యక్షులు షేక్ సిద్ధాంతి కరిముల్లా, చేవూరి కృష్ణ మూర్తి పాల్గొన్నారు.

ఆర్టీసీలో ఆన్‌కాల్ డ్రైవర్ పోస్టుకు దరఖాస్తులు

డీఎం జీఎస్‌వీవీ కుమార్



సత్తెనపల్లి: ఏపీఎస్ఆర్టీసీ సత్తెనపల్లి డిపోలో ఆన్ కాల్ డ్రైవర్లుగా పనిచేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆన్ కాల్ డ్రైవర్లుగా పని చేసే వారికి చదవడం, రాయడం వచ్చి ఉండాలని, హెవీ వెహికల్ లైసెన్స్ కలిగి 18 నెలలు గడిచి ఉండాలని, లైసెన్స్ ఫోర్స్‌లో ఉండాలన్నారు. సంస్థ నిబంధనల ప్రకారం డ్రైవింగ్ చేసిన యెడల వారికి ప్రతి దినం రూ.800 వేతనం ఇవ్వబడుతుందన్నారు. ఈ అర్హతలు గలవారు ఆగస్టు 2వ తేదీ లోపు డిపో మేనేజర్ కార్యాలయంకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9959225429, 7382897583 నంబర్లలో సంప్రదించాలన్నారు.

తాగలేం... వాడుకోలేం

వారం రోజులుగా మురుగునీరు సరఫరాతో ప్రజల అవస్థలు





అసలే వర్షకాలం ... ఆపై సీజనల్ వ్యాధుల భయం... దీనికి తోడు పంచాయతీలో జల జీవన్ మిషన్ ద్వారా కుళాయిలకు సరఫరా చేసే తాగునీరు మురుగు, దుర్వాసన మయం. రక్షిత మంచినీరు సరఫరా అయ్యే పైపులకు లీకులు ఏర్పడ్డి పైపుల్లో వర్షం నీరు చేరడంతో ఈ పరిస్థితి నెలకొంది. నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడు మేజర్ పంచాయతీలోని ఎస్సీ కాలనీలో వారం రోజుల నుంచి మురుగు నీరు సరఫరా అవ్వడంతో దాదాపు 100 కుటుంబాలకు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మురుగునీరు సరఫరా కావడంతో ఆ నీరు తాగలేక.. వాడుకుంటే చర్మ వ్యాధుల బారిన పడుతుండటంతో భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి మురుగు నీరు సరఫరా కాకుండా లీక్‌లకు మరమ్మతులు చేయాలని వారు వేడుకుంటున్నారు.

– పెదకూరపాడు

పట్టణ నూర్ బాషా సంఘం నూతన కార్యవర్గం



అధ్యక్షులు షేక్ సైదు ఖాశిం



ప్రధాన కార్యదర్శి షేక్ అన్వర్ అక్తర్

మాచర్ల: నూర్ బాషా సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం రాత్రి ఎన్నుకున్నారు. పట్టణంలోని కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏకగ్రీవంగా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు షేక్ నాసర్ వలి, షేక్ సయ్యద్ హుస్సేన్ తెలిపారు. గౌరవ అధ్యక్షులుగా షేక్ నాసర్, నూతన అధ్యక్షుడుగా షేక్ సైదు ఖాశిం, ప్రధాన కార్యదర్శి షేక్ అన్వర్ అక్తర్, కోశాధికారిగా షేక్ మౌలాలి(హోటల్), ఉపాధ్యక్షుడుగా షేక్ మదీన్, సంయుక్త కార్యదర్శిగా చిన్న ఇమాంసాలు ఎన్నికయ్యారు. గౌరవ సలహాదారుగా షేక్ కొదాన్, షేక్ బాదన్ బాయ్, షేక్ రషీద్, షేక్ ముర్తుజాలి నియమితులయ్యారు. షేక్ సైద్ హుస్సేన్, నూర్ బాషా క్వాజి(నాయబ్) పర్యవేక్షించారు.

బీసీ హాస్టళ్లపై నిర్లక్ష్యం తగదు

వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు గాంధీ



గురజాల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీసీ హాస్టళ్లను పట్టించుకున్న దాఖలాలు కనిపించలేదని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సిద్దాడపు గాంధీ పేర్కొన్నారు. ఆయన తన కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. బీసీల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం గాలికోదిలేసిందని విమర్శించారు. బీసీల అభ్యున్నతి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి ఉన్న సమయంలో బీసీ హాస్టళ్లను అభివృద్ధి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. బీసీలను కూటమి ప్రభుత్వం కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తుందన్నారు. బీసీ సంక్షేమంపై మంత్రితో చర్చకు మేము సిద్ధమని ప్రకటించారు.

అమ్మవారి ఆలయంలో చోరీ

గురజాల: పట్టణంలోని పాతపాటేశ్వరి అమ్మవారి ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. దేవదాయ శాఖ కార్యానిర్వహణాధికారి తెలిపిన వివరాల ప్రకారం...గుర్తు తెలియని దుండగులు సోమవారం రాత్రి ఆలయంలోకి చొరబడి హుండీని పగలగొట్టి రూ.70 వేల నగదును దొంగిలించారు. మంగళవారం ఉదయం ఆలయ పూజారి పిన్నెల్లి సుబ్రమణ్యం ఆలయానికి రాగా బయట గేటు తలుపులు పగలగొట్టి ఉన్న విషయాన్ని గమనించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు అందించారు. సీఐ భాస్కర్‌రావు, ఎస్‌ఐలు బి.అనంతకృష్ణ, వై.వినోద్‌కుమార్‌లు దేవాలయాన్ని పరిశీలించారు.

ఆట్యా-పాట్యా జిల్లా జట్టుకు నకరికల్లు విద్యార్థులు



నకరికల్లు: ఆట్యా-పాట్యా జిల్లా జట్టులో నకరికల్లు ఉన్నత పాఠశాలకు చెందిన 11 మంది విద్యార్థులు స్థానం సంపాదించారు. వీరంతా ఒకే పాఠశాలకు చెందిన వారు కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. బాలుర జట్టులో వై.నిఖిల్, బి.మణికంఠ, షేక్ నబీరసూల్, డి.కోటేశ్వరరావు బాలికల జట్టులో డి.రంగమహాలక్ష్మి, టి.లిఖిత, జి.సాధిక, సీహెచ్ విజయ స్టాండ్‌బైలో ఎం.ప్రణీత్, ఎస్.రామ్‌చరణ్, పి.రుద్రశివగణేష్‌లు ఎంపికయ్యారు. వీరు ఆగస్టు 9, 10 తేదీలలో ఒంగోలులో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పల్నాడు జిల్లా జూనియర్ జట్టుగా పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు జాలాది శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ జి.ఝాన్సీరాణి, విద్యా కమిటీ చైర్మన్ కాసా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

పత్తిలో సస్యరక్షణ చేపట్టాలి



పత్తిలో తీసుకోవాల్సిన సస్యరక్షణ వివరిస్తున్న మండల వ్యవసాయాధికారి లక్ష్మారెడ్డి

రెంటచింతల: పత్తి పంటను సాగుచేస్తున్న రైతులు వ్యవసాయ అధికారుల సూచనలతో సస్యరక్షణ చర్యలు తీసుకొని పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కట్టా లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గ్రామాలలో మిట్టగుడిపాడు, గోలి గ్రామాల లో పొలంపిలుస్తోంది నిర్వహించారు. కార్యక్రమంలో పత్తి పంట పొలాలను ఆయన సందర్శించి రైతులకు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనపై రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో సాగుచేస్తున్న పంటలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అగ్రి కల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఏఐసీ)ద్వారా వాతావరణంలో వచ్చే మార్పులతో పంటలకు నష్టం వాటిల్లితే రైతులను ఆదుకునేందుకు ఈ వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. 2025 ఖరీఫ్ నుంచి అమలు చేస్తున్నట్లు వ్యవసాయ రుణం పొందిన రైతులు బ్యాంక్‌శాఖ ద్వారా బీమా ప్రీమియం చెల్లించుకోవచ్చన్నారు. వ్యవసాయ రుణం పొందని రైతులు దగ్గరలోని కామన్ సర్వీస్ సెంటర్‌లో, మీ-సేవా, రైతు సేవా కేంద్రంలో సిబ్బందిని సంప్రదించి పంటల బీమా చేయించుకోవాలని కోరారు. పత్తి, మిరప, కంది పంటలను 31 జూలై 31వ తేదీ లోపు, వరిపంటకు ఆగస్టు 15 వరకు పంటల బీమా చేయించుకోవడానికి గడువుందన్నారు. ఎకరాకు పత్తికి రూ.1900, మిరపకు రూ.360, వరికి రూ.80, కందికి రూ.40 ప్రీమియం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రాంబాబు పాల్గొన్నారు.

రైతులు పంటల బీమా చేయించుకోవాలి

పిడుగురాళ్లరూరల్: రైతులు ఫసల్ బీమా చేసుకోవాలని, రెండు రోజులు మాత్రమే గడువు ఉందని మండల వ్యవసాయశాఖ అధికారి సంధ్యారాణి తెలిపారు. మండలంలోని గుత్తికొండ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా రైతు భరోసా కేంద్రంలో రైతులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ సహాయకులు రాజశేఖర్, అహ్మద్ పాల్గొన్నారు.

నైట్ స్పీడ్ బ్రేకర్స్



రాత్రి సమయంలో ఐలాండ్ సెంటర్‌లో వాహనాలకు అడ్డంగా ఉన్న పశువులు

ఆవులు రోడ్లపై ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పశువులు దేవుడితో సమానం అలాంటి పశువులను దేవుడి కోసం వదిలిస్తే వారి ఆలనాపాలన ఎవరు చూడాలి. రాత్రి సమయంలో వాహనాలు వేగంగా వెళ్తుండగా ఈ వాహనాలు ఎదురుగా వచ్చి స్పీడ్ బ్రేకర్‌గా మారిపోతున్నాయి. అదే సమయంలో వేగంగా వస్తున్న వాహనాలు చూడకపోతే పెద్ద ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. పిడుగురాళ్ల పట్టణంలోని మెయిన్‌సెంటర్ అయిన ఐలాండ్ సెంటర్‌లో మూడు రహదారులకు అడ్డంగా ఉండిపోతున్నాయి. అధికారులు చొరవ తీసుకొని గోశాల ఏర్పాటు చేసి వాటిని తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

– పిడుగురాళ్ల

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మాచర్ల: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా బుధవారం సరఫరా నిలిపివేయనున్నట్లు డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.రామయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు కరెంట్ ఉండదని చెప్పారు. సుద్దగుంతల, ఎన్ఎస్ డ్యాం, తాళ్లపల్లి, ద్వారకాపురం సబ్ స్టేషన్‌లలోని ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

దుర్గి మండలంలో...

దుర్గి: మండలంలోని అడిగొప్పల సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ పనుల నిమిత్తం సరఫరా నిలిపివేయనున్నట్లు అసిస్టెంటు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.శ్రీశైలం మంగళవారం తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు సరఫరా ఉండదని చెఆప్పరు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలి

ఎస్ఐ డి.ప్రవీణ్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ప్రవీణ్

బెల్లంకొండ: చిన్నతనం నుంచి దురలవాట్లకు గురి కాకుండా, ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలని బెల్లంకొండ ఎస్ఐ డి.ప్రవీణ్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై 'డ్రగ్స్ వద్దు బ్రో' కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ చెడు వ్యసనాలకు యువత అలవాటు పడి, జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, డ్రగ్స్ వల్ల ఎన్నో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. అనంతరం డ్రగ్స్‌పై అవగాహన కల్పించేందుకు వాల్ పోస్టర్లను అంటించారు. కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది రాజేష్, మల్లికార్జునరావు, ఎల్.వెంకటేశ్వరరావు, శ్రీను, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో కాంస్య పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల పాలకవర్గ ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: జాతీయస్థాయి తైక్వాండో పోటీలలో శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలకు చెందిన విద్యార్థులు పతకాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ యక్కల మధుసూదనరావు మంగళవారం తెలిపారు. కృష్ణా జిల్లా టైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో ఈనెల 25 నుంచి 27వతేదీ వరకు నిర్వహించిన 10వ జాతీయ ఓపెన్ జూనియర్ అండ్ సీనియర్ క్యోరుగి, పూంసే టైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలలో తమ విద్యార్థులు ఎం.సాయిశ్రీకర్ అండర్ 73 కేజీల విభాగంలో రెండు కాంస్య పతకాలు, వి.తులసీ తన్మయ్ ఓపెన్ కేటగిరి 46 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించినట్లు వివరించారు. విద్యార్థులను కళాశాల పాలకవర్గ అధ్యక్ష్య, కార్యదర్శులు కపలవాయి విజయ కుమార్, నాగసరపు సుబ్బరాయ గుప్త, ప్రిన్సిపల్ డాక్టర్ సుధీర్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాస సాయి, నర్సింగ్ ఇన్‌చార్జ్ ఏవీఎస్ గుప్తా, అధ్యాపకులు అభినందించారు.

గుర్తింపు కార్డులకు దరఖాస్తు చేసుకోండి

నాదెండ్ల: కౌలురైతులు గుర్తింపు కార్డులకు దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం అందించే అనేక పథకాలు వర్తిస్తాయని వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని కనపర్రు, అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తాము సాగు చేసే పంట వివరాలను ఈక్రాప్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. పత్తి సాగు చేసే రైతులు ఈ నెలాఖరులోగా బీమా క్రింద ఎకరాకు రూ.1900లు ప్రీమియం చెల్లిస్తే విపత్కర పరిస్థితుల్లో పంట నష్టపరిహారం దక్కుతుందన్నారు. మిరప, కంది, వరి సాగుదారులు ఆగస్టు 15లోగా నమోదు చేయించుకోవాలన్నారు.